శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## జలాశయాల గణనను పక్కాగా నిర్వహించాలి




**నెల్లూరు, జనవరి 28, ప్రభాతవార్త - కలెక్టరేట్** నీటి వినియోగాన్ని సమర్ధవంతంగా చేయడానికి తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడానికి జలగణన ఉపయోగపడుతుందని జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ అన్నారు. జిల్లాలో 7వ చిన్న తరహా నీటి వనరుల గణన, 2వ జలాశయాల గణనను నిర్వహించేందుకు గణకులకు జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు జరుగుచున్న చిన్నతరహా నీటి వనరుల, జలాశయాల గణనను పక్కాగా నిర్వహించాలన్నారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా చేసే ఎన్యూమరేషన్‌లో మొత్తం ఐదు షెడ్యూల్స్ గ్రామ, పట్టణ, భూగర్భజల వనరుల పథకాల, ఉపరితల జలవనరుల పథకాల, వాటర్ బాడీ షెడ్యూల్స్ గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ శిక్షణలో మొబైల్ యాప్‌లోని గణనకు సంబంధించి అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని, అనుమానాలను నివృత్తి చేసుకొని మండల స్థాయిలో మిగిలిన వారికి శిక్షణ అందించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి పారదర్శకంగా, తప్పులకు తావులేని విధంగా ఎన్యూమరేషన్ పూర్తి చేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిపిఓ నరసింహరావు,సహాయ సంచాలకులుఅయేషా, ఎస్ఓశ్యామ్ కుమార్, వివిధ మండలాల ఎఎస్ఓలు పాల్గొన్నారు.

## 10 లక్షల సిఎం ఆర్‌ఎఫ్ చెక్కు అందజేసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలను సిఎం చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. లివర్ సమస్యతో బాధపడుతున్న వర్షిత్‌కు 10 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం విజయవాడలోని విపిఆర్ నివాసంలో అందించారు. ఇందుకూరు పేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన ఈదూరు మధు కుమారుడు వర్షిత్(9) లివర్ సమస్యతో బాధపడుతున్నారు. లివర్ ట్రాన్స్‌ప్లామెంటేషన్ చేయించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఈ విషయాన్ని వేమిరెడ్డి దంపతులకు తెలియజేశారు. వెంటనే స్పందించిన వారు సిఎంఆర్‌ఎఫ్‌లో నమదు చేయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం 10 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఉత్సాహంగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుడివారి కుమార్ రెడ్డి, శేఖర్, అశోక్, ఇతర సభ్యులు తదితరులు ఉన్నారు.

## వి.ఎస్.యూ లో ఇంటర్‌కాలేజియేట్ పురుషుల క్రీడల టోర్నమెంట్ ముగింపు




**వెంకటాచలం, జనవరి 28, ప్రభాతవార్త :** కాకుటూరు లోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటర్‌కాలేజియేట్ పురుషుల క్రీడల టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎస్. విజయ భాస్కర రావు ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్రీడలు విద్యార్థుల శారీరక,మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. క్రీడల ద్వారా విద్యార్థులు ఏకాగ్రత, సహనం, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చు. విజయం మాత్రమే కాదు, పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి చాలా ముఖ్యమైనది. అంతేకాక అన్ని కళాశాల క్రీడకారులు అంతర్ విశ్వ విద్యాలయాల పోటిలలో బహుమతులు సాదించాలని అన్నారు.

**పాల్గొన్న బృందాల సంఖ్య:** బాస్కెట్ బాల్-7,చెస్-18,సాఫ్ట్ బాల్-18 హ్యాండ్ బాల్-8,ఉత్తమ శరీరాకృతి-7,విజేతలు,రన్నర్ల వివరాలు: బాస్కెట్‌బాల్ విజేతలు జెబి డిగ్రీ కాలేజ్, కావలి రన్నర్లు: వీఎస్యూ కాలేజ్, కావలి చెస్ విజేతలు: జెనెక్స్ విజన్ డిగ్రీ కాలేజ్, నెల్లూరు రన్నర్లు: వీఎస్యూ కాలేజ్, నెల్లూరు సాఫ్ట్ బాల్ విజేతలు: డాక్టర్ ఎస్.ఆర్.జె. డిగ్రీ కాలేజ్, ఆత్మకూరు రన్నర్లు: వీఎస్యూ కాలేజ్, నెల్లూరు హ్యాండ్ బాల్ విజేతలు: జెబి డిగ్రీ కాలేజ్, కావలి రన్నర్లు: వీఎస్యూ కాలేజ్, నెల్లూరు ఉత్తమ శరీరాకృతి (బెస్ట్ ఫిజిక్) విజేతలు: వీఎస్యూ కాలేజ్, నెల్లూరు రన్నర్లు: జెనెక్స్ విజన్ డిగ్రీ కాలేజ్, నెల్లూరు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సి.హెచ్. వెంకటరాయులు, టోర్నమెంట్ నిర్వాహకులు డాక్టర్ పి. నారాయణరాజు, విశ్వవిద్యాలయ పిడి డాక్టర్ ఏ. ప్రవీణ్ కుమార్, ఇతర కోచ్‌లు, మరియు ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## రైలు నుండి జారి పడి వ్యక్తి మృతి

**నెల్లూరు క్రైం, జనవరి 28, ప్రభాతవార్త** ప్రమాదవశాత్తు కదులుతున్న రైలు నుండి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన స్థానిక వేదాయపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. యువకుడి 30-35 ఏళ్ల మధ్య వయసు ఉంటుందని, నలుపు రంగు ఫుల్ హ్యాండ్ టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంప్రభుత్వాసుపత్రికి తరలించిరైల్వే ఎస్ఐ జి.మాలకొండయ్య కేసు దర్యాప్తు చేపట్టారు.

## బాబు భరోసా తో పెట్టుబడుల వెల్లువ : ఎమ్మెల్యే



**వింజమూరు, జనవరి28, ప్రభాతవార్త: వరల్డ్** ఎకనామిక్ ఫోరం సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి లోకేష్ భరోసాతో ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు వెల్లువలా రానున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్ కలయికతో రాష్ట్రానికి కొత్త వెలుగులు తెస్తున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటి రంగాన్ని పరిచయం చేసి తెలుగువారి కీర్తిని ప్రపంచానికి చాటారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రపంచ దిగ్గజాలతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానం పలకడంతోపాటు రాష్ట్రం గురించి గొప్పగా వివరించారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నా రన్నారు. పెట్టుబడులకు అనువైన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రతి పారిశ్రామికవేత్తకు రాష్ట్రంలో పెట్టుబడులకు భరోసా ఉందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ళలో తీసుకురాలేని పెట్టుబడులను కూటమి ప్రభుత్వం 7నెలల్లోనే సాధించి బ్రాండ్ ఎపిగా నిలిచిందన్నారు. ఇప్పటికే 5లక్షల కోట్ల పెట్టుబడులతో 50కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, వాటి కార్యకలాపాలు మొదలుకావడంతో 40వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వర్గదామం కానుందన్నారు.

## వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**కందుకూరు, జనవరి 28, ప్రభాతవార్త** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి రాంబాబు తెలిపారు. మంగళవారం 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎన్ లక్ష్మి ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ పెట్టుకోవడం వలన కలుగు ప్రయోజనాల గురించి వివరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి రాంబాబు మాట్లాడుతూ కారులో ప్రయాణించే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. అదే విధంగా ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు. రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జనవరి28, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం సాయంత్రానికి 1838 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 67.702టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 350, ఎన్‌ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2750, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.102మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## జిల్లాలో నీటిపారుదల సమస్యలను పరిష్కరించండి

### రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసిన ఎంపి వేమిరెడ్డి
### కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి ఇతర అంశాలపై చర్చ



**నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవవార్త :** నెల్లూరు జిల్లాలోని పలు నీటి పారుదల సమస్యలను పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు. విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిమ్మల రామానాయుడుతో ఎంపి వేమిరెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరిగేషన్‌కు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధి పై ఆయనతో మాట్లాడారు. కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ ప్రాధానాన్ని మంత్రికి వివరించారు. అలాగే పలు పెండింగ్ ప్రాజెక్టుల పనుల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందించారు. నెల్లూరు జిల్లాలో నెలకొన్న నీటి పారుదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## పుష్ప సినిమా డైలాగ్‌తో వార్నింగ్ ఇచ్చిన కాకాని



**నెల్లూరు రూరల్, జనవరి 28, ప్రభాతవార్త** ఇటీవల రిలీజ్ అయిన పుష్ప మూవీ డైలాగ్స్ పొలిటికల్ లీడర్స్‌కు బాగా ఊపు చేస్తుంది. నెల్లూరు నగరంలోని మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడం అంటూ వైసిపి నాయకుడు బాలకృష్ణారెడ్డి ఇంటి కూల్చివేసిన స్థలం వద్దకు చేరుకున్న కాకాని పుష్ప డైలాగులతో టిడిపి నాయకులకు అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సిటీ నియోజకవర్గ ఇంచార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి, టిడిపి చేసిన దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా నిరసన తెలియజేసి, పార్టీ అండగా ఉంటుందని బాలకృష్ణరెడ్డికి భరోసానిచ్చి టిడిపి నేతలను హెచ్చరించారు. నెల్లూరు బాలాజీ నగర్ 15వ డివిజన్‌లో మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడం అంటూ కూల్చివేసిన వైఎస్ఆర్సిపి నాయకులు బాలకృష్ణారెడ్డి ఇంటిని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు నగర వైసిపి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వైసిపి నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి చేసిన దౌర్జన్య కాండకు వ్యతితిరేకంగా వైఎస్ఆర్‌సిపి నాయకులు నిరసన తెలియజేశారు. బాలకృష్ణరెడ్డితో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని భరసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై దాడులు ధమనకాండ నిర్వహిస్తుందని జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. అందుకు పరాకాష్టగా బాలకృష్ణ రెడ్డి ఇంటిని దౌర్జన్యంగా కూల్చివేశారని పేర్కొన్నారు. ఇది మా జాగీరు అన్న రీతిలో వ్యవహరిస్తే కూటమి నేతలకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి నారాయణకు నెల్లూరు ప్రజలు 70 వేలకు పైగా మెజారిటీ ఇచ్చి గెలిపించింది. సామాన్య ప్రజలను ఇబ్బంది పెట్టడానికా అని ప్రశ్నించారు. మంత్రి నారాయణ నెల్లూరు నగరంలో సామాన్యులనే కాదు, వైద్యులను కూడా ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. పొగతోటలోని డాక్టర్లకు సంబంధించిన హాస్పిటల్ నేమ్ బర్డులను తొలగిస్తూ వారి కట్టడాలను కూల్చివేస్తూ మరికొందరి కట్టడాలను కూల్చివేస్తామంటూ బెదిరింపులకు దిగుతూ డాక్టర్లను మంత్రి నారాయణ భయభ్రాంతులకు గురి చేస్తూ అక్రమపాలన కొనసాగిస్తున్నారన్నారు. అంతే కాకుండా చిన్న చిన్న ఇళ్లను కూడా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ టేపులతో కొలిపించి మరి పన్నులు వేస్తూ ప్రజలను పీడించుకుని తింటున్నాడని దుయ్యబట్టారు. పన్నులు కట్టలేని స్థితిలో ఉన్న పేదవారిపైజులం ప్రదర్శిస్తూ వారి ఇంటి కరెంట్ కనెక్షన్, మంచి నీటి కనెక్షన్లు కట్ చేసి నారాయణ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు.

## ఆస్తి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి : కమిషనర్




**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 28, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని కమిషనర్ , డిప్యూటీ కమిషనర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100 లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్య తేజ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి సచివాలయం పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించాలని,పన్నుబకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ ద్వారా చెల్లింపులు చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. నగరములో అభివృద్ధి పనులకు గాను ప్రతి అడ్మిన్ కార్యదర్శి వారికి సంబంధించిన సచివాలయ పరిధిలోని నిర్దేశించిన ఆస్తి పన్నులు వసూలు చేసిన యెడల నగరము ఎంతో అభివృద్ధి చెందుతుంది. సచివాలయాలు వార్డు ప్రజలకు అర్థమయ్యే విధముగా సచివాలయ బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రతి పరిపాలన కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. ప్రైవేట్ బిల్డింగ్లలో ఉన్న సచివాలయాలను ఆయా వార్డు ప్రజలకు సౌకర్యం కొరకు వార్డు పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నచో బదిలీ చేసేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు లోకనాథం, శ్రావణ్, శరత్, వంశీ నాథ్ రెడ్డి, సందీప్, కార్తీక్ రెడ్డి, ఏ 1 గుమస్తా కృష్ణ కిషోర్, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గోవర్ధన్‌రెడ్డి నువ్వు చేసిన అక్రమాలు గుర్తు చేసుకో



**నెల్లూరు, జనవరి 28, ప్రభాతవార్త-వైద్యం** గోవర్ధన్‌రెడ్డి గతంలో నువ్వు మాజీ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అక్రమాలని ఒక సారి గుర్తు చేసుకోవాలని, కాకాణి, చంద్రశేఖర్‌లు గొంతుచించుకుని మాట్లాడుతున్నారని నెల్లూరు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటి ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని జిల్లా టీడీపీ కేంద్ర కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారాయణ మీద విమర్శలు చేసేస్థాయి కాకాణికి లేదన్నారు. రాక్షస పాలనకు వైసీపీ కేరాఫ్ అని, విధ్వంసం చేయడమే వారి సిద్ధాంతమని కోటంరెడ్డి అన్నారు. **కాలువ పోరంబోకు స్థలంలో వైసీపీ నేతలు ఇళ్లు కట్టడితే ప్రభుత్వం ఊరుకుంటుందా..?** అని ఆయన ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వులు మేరకు కూల్చేస్తే.. అధికారులను బెదిరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వస్తుందని కాకాణి పగటికలలు కంటున్నారని ఎద్దేవ చేశారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అరాచకాలు సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుసని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. బీసీ నేతల రొయ్యలగుంటల విధ్వంసం చెయ్యడం, అక్రమ కేసులు పెట్టడం ఇంకా ప్రజలు మరిచిపోలేదన్నారు. నీతి మంతుడు లాగా కాకాణి మాట్లాడుతూ ఉండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దళితుడు ఉదయగిరి నారాయణని పోలీసులు చంపేస్తే అతనికి న్యాయం చేయకుండా పోలీసుల్ని కాపాడిన నీచ చరిత్ర కాకానిది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము విధ్వంసం చేయడం మొదలు పెడితే ఒక్కరు కూడా రోడ్డు మీద తిరగలేరని, కానీ తాము అలా చేయడం లేదని కోటంరెడ్డి వెల్లడించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను అడ్డం పెట్టుకుని మంత్రి నారాయణతో పాటు ఆయన కుటుంబాన్ని వేధించలేదా అని ప్రశ్నించారు. మంత్రి నారాయణను విమర్శించే స్థాయి చంద్రశేఖర్‌రెడ్డికి లేదని కోటంరెడ్డి వ్యాఖ్యానించారు. ఫై కార్యక్రమంలో నగర అధ్యక్షులు మామిడాల మధు, ఉచ్చిభువానేవార్ ప్రసాద్, కువ్వారపు బాలాజీ, అంచూరి శ్రీనివాసులు నాయుడు, జహీర్, కోకు మహేంద్రరెడ్డి, ఆకుల హనుమంత్ రావ్, తంబీ సుజన్ కుమార్, పెనుబర్తి సాయి, పిరిగల నవీన్, రామ్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య వాహనాలకు వ్యర్థాలను అందించండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 28,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలోనే చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయటం మానుకోవాలని కమిషనర్ సూర్యతేజ ప్రజలకు తెలియజేశారు.పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 44వ డివిజన్ పెద్ద బజార్, ముంగమూరి వారి వీధి, బార్కాస్ రోడ్డు, రాయాజీ వీధి, తిప్పరాజు వారి వీధి, శివ ప్రియ హోటల్, కలెక్టరేట్, మహబూబ్ ఖాన్ పార్క్ తదితర ప్రాంతాలలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి హెచ్చరించాలని మరలా అదే విధంగా ప్రవర్తిస్తే భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. రోడ్లపై పార్క్ చేసి ఉన్న నిరుపయోగంగా ఉన్న వాహనాలను గుర్తించి ట్రాఫిక్ పోలీస్ విభాగం వారి దృష్టికి తీసుకెళ్లి ఆయా వాహనాలను వెంటనే రోడ్లపై నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నగరవ్యాప్తంగా ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తమ ప్రాంగణాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సాధ్యమైనంతవరకు పబ్లిక్ రోడ్లపై వాహనాల పార్కింగ్ ను మానుకోవాలని కమిషనర్ సూచించారు. డివిజన్ పరిధిలో డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. చిన్న బజారు ప్రాంతంలోని పాత కూరగాయల మార్కెట్ ప్రాంతంలో పశువుల సంచారాన్ని నియంత్రించేలా గేట్లు ఏర్పాటు చేయాలని,మహబూబ్ ఖాన్ పార్కు నందు లైటింగ్, పచ్చదనం కొరకు పూల మొక్కలు,చెట్లు,సీసీ కెమెరాలు ఏర్పాటు చేయవలసినదిగా ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి జంగల్ క్లియరెన్స్ చేయించాలని, స్థల యజమానులకు నోటీసులు, పిదప హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి పిదప ఖాళీ స్థల పన్నులు వసూలు చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఏ.డి.హెచ్.ప్రదీప్ కుమార్,వెటర్నరీ డాక్టర్.మదన్ మోహన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రకాష్ బాబు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాలకృష్ణకు పద్మవిభూషణ ప్రకటించడం హర్షణీయం



**బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త :** సినీనటుడు,హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ ప్రకటించడం హర్షణీయమని తెలుగుదేశం నాయకుడు వింజం రామనాయుడు హర్షం వ్యక్తం చేశారు. నందమూరి బాలకృష్ణ సేవాతత్వ కలవాడని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. సినిమారంగంలో,రాజకీయ రంగం లో,సేవా రంగంలో తనకంటూ ఒ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొన్న బాల కృష్ణకు పద్మవిభూషణ ప్రకటించడం హర్షనీయమని అన్నారు.

## విధుల్లో అలసత్వం తగదు



**వరికుంటపాడు,జనవరి28,ప్రభాతవార్త:** పొదుపు సంఘాలకు రుణాలు ఇప్పించడంలో తిరిగి కట్టించ డంలో వీఓఎలు అలసత్వం ప్రదర్శించవద్దని ఎపిఎం సుధాకర్‌రావు అన్నారు.మంగళవారం స్థానిక శ్రీశక్తి భవన్‌లో వెలుగు సిసిలు,వీఓఎలతో సమీక్షాసమావేశం నిర్వహించారు.స్త్రీనిధి బకాయిల రుణాల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధవహించాలని వీఓఎలకు సూచించారు.విధులలో ఎవరైన అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల ఆరుణమ్మ,అకౌంటెంట్ బాను,సిసిలు,ఎస్‌హెచ్‌సి సభ్యులు,వీఓఎలు పాల్గొన్నారు.

## నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

**బిట్రగుంట జనవరి 28 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలులోని స్వర్గీయ అమర బచ్చు చారిటబుల్ ట్రస్ట్, స్థానిక వైద్యులు, హెచ్ సి జి ఎంవిఆర్ ఒంగోలు క్యాన్సర్ సెంటర్ సహకారంతో రాజవీధి లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం నందు 29వ తేది ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఒంగోలు క్యాన్సర్ సెంటర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఏ.భాస్కర్ తెలిపారు. క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్. ఆళ్ల. దీప్తి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అని తెలిపారు. దీంతోపాటు బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు.

## ఉత్పాదన ఉపాధి మరింత మెరుగుకు డీఆర్‌డీఏ- పీడీ



**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి నగేష్ కేంద్రంలో మంగళవారం ఉత్పాదన మరింత మందికి ఉపాధి కల్పించే ధ్యేయ ంతో ముందుకు అడుగులు వేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజు కుమారి తెలిపారు. కేంద్రంలో తయారు చేసిన కళాత్మకమైన వస్తువులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్రంలో తయా రు చేసిన వస్తువులు కేటలాగ్ ఉండేలా చూడాలని సూచించారు. ఈ యూనిట్‌ని మరింత పెంచేందుకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మార్కెట్లో పెట్టాలి అంటే ఎన్ని వస్వుఉలు తయారు చేస్తున్నారు. క్రమ పద్ధతిలో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రైమరీ కోఆర్డినేటర్ జి.అరుణ్ కుమార్, జిల్లా కార్యాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిరిపురంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ దాడులు
## 18 బాటిల్స్ స్వాధీనం... అదుపులో ఇద్దరు వ్యక్తులు

**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం సిరిపురంగ్రామంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఆకస్మికదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పరుసు సుకుమార్, పరుసు సురేష్‌ల వద్ద లభించిన 18 మద్యం బాటిళ్లను సీజ్‌చేశారు. వారిద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఈ దాడుల్లో కావలి పిఅండ్ఈఎస్ఐ ఎం.దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.



## ఓగూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం




**కందుకూరు, జనవరి 28, ప్రభాతవార్త :** కందుకూరు మండలంలోని ఓగూరు గ్రామంలో మండల వ్యవసా యాధికారి వి.రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వి.రాము మాట్లాడుతూ రైతులు అందరూ మీ గ్రామ రైతు సేవా కేంద్రాలలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయ కులు ద్వారా రబీ సీజన్లో వేసి అన్ని పంటలకు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని కోరారు. తద్వారా రాబోయే ప్రజల్లో ప్రభుత్వం ద్వారా పంట నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొనుటకు అవకాశం ఉందని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ పి.మాధవ మాట్లాడుతూ ప్రతి రైతు కిచెన్ గార్డెన్ వేసుకోవాలని, ఏటీఎం, ఏగ్రేడ్ మోడల్ గురించి సేంద్రియ డీఏపీ సేంద్రియ పొటాష్ గురించి వివరించారు. పంటల్లో వచ్చే తెగుళ్ళ గురించి వివరించి సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అసిస్టెంట్ కే.అశోక్, ఓగూరు గ్రామ వ్యవసాయ సహాయకులు కే.శరత్‌కుమార్, పశు వైద్య గ్రామ అసిస్టెంట్ షేక్ షాజహాన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రైవేటు స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం



**- పట్టించుకోని అధికారులు**

**ఉలవపాడు, జనవరి 28, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం చాకిచెర్ల పంచాయతీ పరిధిలోని సుబ్బరాయుడి సత్రం గ్రామంలో మంగళవారం స్థల వివాదం ఇరువురి మధ్య చోటు చేసుకుంది. అధికార పార్టీకి చెందిన నాయకుడి ఒత్తిడితో ఒక ప్రైవేటు స్థలంలో సిమెంటు రోడ్డు ఎలా వేస్తారంటూ ఆ స్థలం యజమాని నారిశెట్టి మాల్యాద్రి జేసీబీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎంత సర్దిచెప్పినా అధికార పార్టీ నాయకుడు ససేమీరా అంటూ రోడ్డు వేసేది వేసేదే అంటూ స్థలం వివాదం జరిగింది. అంతటిలో పోలీసులు రంగ ప్రవేశం చేసినా గాని ఫలించని చర్చలు. ఇంత జరిగినా కాని మండల అధికారులు పట్టిపట్టనట్లు ఉన్న వైనం ఆ స్థలం యజమాని జనసేన కార్యకర్త కావడమే ఇందుకు కారణం అంటూ గ్రామస్తులు అనుకుంటున్నారు.

## వవ్వేరులో మత ప్రచారాన్ని అడ్డుకున్న బిజెపి నేతలు



**బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని వవ్వేరులో ఒ మతానికి చెందిన వారు తమ మతంలో చేరాలంటు చేస్తున్న ప్రచారాన్ని బిజెపి నేతలు కాసా శ్రీనివాసులు,అర్బన్ మండల కార్యదర్శి కోనం శ్రీనివాసులు అడ్డుకు న్నారు. మద్రాస్ నుండి మూడు కార్లలో వచ్చి మత ప్రచారం చేస్తుండడంతో ఆయన స్దానికులతో కలిసి అడ్డుకున్నారు. మతం మార్చుకోమని,మా మతంలో చేరమని ప్రచారం చేయడం ఏమిటని వారు ప్రశ్నిం చారు.గ్రామంలో మతం మారమని వారు ప్రచారం చేస్తుండడంతో స్దానికులలో కూడా వ్యతిరేఖత వచ్చింది. అలాగే వవ్వేరులో అనుమతులు లేకుండా కనిగిరి రిజర్వాయర్ స్దలంలో కడుతున్న చర్చి నిర్మాణం వెంటనే నిలిపి వేయాలనిన బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఇరిగేషన్ స్దలంలో ఎలా ఇంత పెద్ద నిర్మాణం చేస్తారని వారు ప్రశ్నించారు.

## రుద్రకోట గ్రామంలో బిజెపి సంవిధాన్ గౌరవ్‌అభియాన్




**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలో బిజెపి కావలి రూరల్ మండల అద్యక్షులు జయకుమార్ అద్యక్షతన మంగళవారం సంవిధాన్ గౌరవ్‌అభియాన్ కార్యక్రమం జరిగింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మారుబోయిన శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డిలు, పరుసు వెంకటేశ్వర్లు, పరుసు మధు, మామిడి వెంక టేశ్వర్లు, ఏడుకొండలు, శ్రీను, సురేంద్ర, తిరుపతి, క్రాంతి, మురళి, లీలామోహన్, చంటి, వంశి, సాగర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఊరికి సమీపంలోనే చికెన్ వ్యర్థాలు.. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**దగదర్తి, జనవరి 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన దగదర్తిలో చికెన్ వ్యర్ధాలు ఊరికి సమీపంలోనే కరెంటు ఆఫీస్ వద్ద దగదర్తి నుంచి సున్నం బట్టి వెళ్లే ఆర్ఎంబీ రోడ్డు మీద ఎక్కడపడితే అక్కడ పడేసి పోతున్నారు. ఆ మార్గం గుండా పోయే ప్రయాణికులకు నడక నడిస్తే మంచిదని ఉదయాన్నే నిద్ర లేచి వాకింగ్ చేసే వారికి దుర్వాసన విపరీతంగా వస్తుంది. వాటివల్ల రోగాలు వస్తాయని భయభ్రాంతులకు గురి అవుతున్నారు. పంచాయతీ సెక్రటరీ గమణించి చికెన్ షాపు వారికి చెప్పి రోడ్డుకి దూరంగా పడవేయాలని దగదర్తి గ్రామ ప్రజలు, వాకర్స్ అటుగా ప్రయాణించే ప్రయాణికులు చెప్తున్నారు.

## పశువైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోండి : జట్‌పిటిసి



**వరికుంటపాడు, జనవరి28, ప్రభాతవార్త :** ఆంధ్ర ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ ఆద్వర్యంలో నిర్వహి స్తున్న పశువైద్యశిభిరాలను పాడిరైతులు, జీవాల పెంపుదారులు సద్వినియోగం చేసుకో వాలని జట్‌పిటిసి సభ్యులు రావెళ్ళ నాగేంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని రామా పురం గ్రామంలో నిర్వహించిన పశువైద్య శిభిరాలకు జట్‌పిటిసి రావెళ్ళ నాగేంద్ర ముఖ్యఅతిదిగ పాల్గొని బ్రోచర్‌ను ఆవిష్కరించారు.అనంతరం ఉచితంగ మందులను అందజే శారు.ఈ సందర్బంగ ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులకు అండగ నిలిచేందుకు ఈ శిభిరాలను నిర్వహిస్తుందని అన్నారు.సీజనల్‌గ వచ్చేవ్యాధులకు ప్రభుత్వమే ఉచితంగ మందులను అంద జేయడం హర్షనీయమని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో నక్కలగండి ప్రాజెక్ట్ చైర్మన్ వేమూరి మధు సూదన్‌రావు,వెటర్‌నరి అసిస్టెంట్ కిషోర్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బోర్డులలో మార్పులు చేపట్టాలి

**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి బీహెచ్ఈఎల్ బస్సు సర్వీస్‌టైమింగ్ బోర్డులో తప్పిదాలు ఉన్నాయని వాటిని మార్పులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆ మార్గంలో ఈసీ పల్లె గ్రామం ఉండగా జి.పల్లె గా సూచించారు. అలాగే డిపో నుంచి పామూరుకు 9.30గంటలకు కనిగిరికి 9.30గంటలకు చేరుకుంటుందని సూచించారు.ఈ పొరపాటును సరి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## విధి వ్యాపారులకు నేటి నుండి 31 వరకు ఇంటర్వ్యూలు

**నెల్లూరు కార్పొరేషన్, జనవరి 28, ప్రభాతవార్త:** నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మైపాడు రోడ్, జాఫర్ సాహెబ్ కాలువ, సత్యనారాయణ పురం నుండి మైపాడు గేటు కూడలి వరకు గల 200 షాపులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకొనేందుకు దరఖాస్తులు చేసుకొన్న వీధీ వ్యాపారులకు ఈ నెల 29 వ తేది నుండి 31వ తేది వరకు నెల్లూరు నగర పాలకసంస్థ టౌన్ వెండింగ్ కమిటీ (గిజుది) ఆధ్వర్యంలో ఇంటర్వ్యూ లు జరుపబడునని కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న వీధీ విక్రయదారులు, వ్యాపారస్తులు నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు సంబంధిత తేదీలలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఇంటర్వ్యూ లకు హాజరు కాగలరు. దరఖాస్తుదారులు ఇంటర్వ్యూ లకు వచ్చేటప్పుడు ఒరిజినల్ ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, మూడు ఫోటో లు, పాన్ కార్డు, గుర్తింపు కార్డు లతో ఇంటర్వ్యూ లకు హాజరు కావలెను.

## బీసీ రుణాలకు దరఖాస్తులు

**సైదాపురం, జనవరి 28, ప్రభాతవార్త :** నిరుద్యోగ బీసీ కులమునకు చెందిన యువతకు స్వయం ఉపాధి కల్పించుటకు, వ్యవసాయ అనుబంధ రంగమునకు, ట్రాన్స్‌ఫోర్టు, చిన్న పరిశ్రమలు, బిజినెస్ రంగానికి సంబంధించిన యూనిట్స్‌కు రుణం కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. బీఫార్మసీ, డీఫార్మసీ చదివిన బీసీ నిరుద్యోగ యువత జనరిక్ మెడికల్ షాపుల కొరకు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ ద్వారా ఈనెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి 7వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. 8నుంచి11వ తేదీ వరకు బ్యాంకు, ఎంపీడీఓ ద్వారా దరఖాస్తులు పరిశీలించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగ బీసీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## ఉల్లాస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి




**కోవూరు, జనవరి 28 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వీవోఏలు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం వీవోఏలకు పొదుపు గ్రూపు ఉత్సాహవంతులైన అధ్యక్షులకు ఉల్లాస్‌కు సంబంధించిన బోధనా పుస్తకాలను వారికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆరు నెలల పాటు నిరక్ష్యరాస్యులను పూర్తిగా అక్షరాస్యులుగా తీర్చిదిద్ది జిల్లాకు కోవూరు మండలాన్ని ముందుకు వరుసలో ఉండేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. ముఖ్యంగా పొదుపు గ్రూపులో ఉన్న మహిళా సభ్యులందరూ పూర్తిగా అక్షరాస్యులుగా తయారు చేయాలన్నారు. అనంతరం గ్రామాల్లో గుర్తించిన నిరక్ష్యరాస్యులకు తరగతులు నిర్వహించి ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం సెల్‌ఫోన్ వినియోగం, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం వంటి వ్యవహారాలపై అవగాహన కల్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. వీటితో పాటు బ్యాంక్ లావాదేవిలు, పొదుపు గ్రూపులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ, యూపీఐ చెల్లింపులు, వివిధ యాప్‌ల వినియోగంపై కూడా వారిలో అవగాహన కల్పించేలా చూడాలన్నారు. అనంతరం ఉల్లాస్‌కు సంబంధించి భోధనా తరగతుల పుస్తకాలను వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్బరాజు, సీసీలు రాజశేఖర్, చైతన్యబాబు, రాము, శోభ, సంఘమిత్ర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

## అర్హత లేని వారిని గుర్తించి వివరాలు తెలపాలి



**కోవూరు, జనవరి 28 ప్రభాతవార్త :** కోవూరు మండలంలో ఇటీవల కాలనీల్లో ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలాల్లో ఇప్పటికీ ఇళ్లు కట్టుకోని వారిని అర్హత లేని వారిని గుర్తించి వారి వివరాలు రెండు రోజుల్లోగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేసేలా సంబంధిత గ్రామ వీఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ కాలనీల్లో ఇప్పటివరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టని వారిని గుర్తించి ఆ సర్వే నెంబర్, వారి పూర్తి వివరాలను యుద్ధప్రాతిపదికన గుర్తించి వెంటనే అందజేయాలన్నారు. అదేవిధంగా ఎవరైనా అనర్హులుగా ఉండి పట్టాలు పొంది అవి నేటికీ నిరుపయోగంగా ఉంటే ఆ వివరాలు కూడా అందజేయాలన్నారు. అదేవిధంగా ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వచ్చే అర్జీలకు సంబంధించి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేలా సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలని వీఆర్వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తదితరులు ఉన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో తప్పనిసరిగా నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు ఉండాలని పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ షాహిన పేర్కొన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను మంగళవారం ఆమె ఎస్ఎంసీ కమిటీ సభ్యులతో కలిసి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపట్టే ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉండేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థులు కూడా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తా చెదారాలను తమ ఇష్టానుసారంగా ఎక్కడంటే అక్కడ పడవేయకుండా చెత్త కుండీలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ వైస్ చైర్మన్ దేవసేన, సభ్యులు శంకర్ ప్రసాద్, సతీష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## పశు వైద్య శిబిరాలు పాడి రైతులకు ఉపయోగకరం



**కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలు పాడి రైతులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడుతున్నాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరు మండలం నేతాజీనగర్ కాలనీలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల్లో పాడి రైతులు తమకు సంబంధించిన గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు తీసుకువచ్చి వాటికి ప్రస్తుతం సీజన్‌లో వచ్చే వ్యాధులపై ఉచిత మందులు పొంది ఏమైనా సమస్యలు ఉంటే వాటిని ఇందులో నివృతి చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో సూడి నిర్ధారణ పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలను పశు వైద్యుల ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాలను పాడి రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వేగూరు పశు వైద్యులు డాక్టర్ షబానా 39 గేదెలకు నట్టల నివారణ మందు, 5 గేదెలకు సూడి పరీక్షలు, 60 గొర్రెలకు నట్టల నివారణ మందును పశు సహాయకుల చేత అందించారు. ఈ కార్యక్రమంలో పశు సహాయకులు , పాడి రైతులు ఉన్నారు.

## గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి



**కలువాయి జనవరి 28 ప్రభాతవార్త :** మండలంలోని అన్ని గ్రామాలలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పా టు చేయాలని ఆయా గ్రామ పంచాయితీల సర్పం చులకు ఎస్ఐ సుమన్ తెలిపారు. స్దానిక పోలీస్ స్టేషన్ లో మంగళవారం అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులతో ఆయన ఈవిషయంపై సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలో ప్రధాన కూడలి నందు సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలకు పాలు పడితే వారిని గుర్తుంచేందుకు సులభతరం అవుతుందని అన్నారు. ఆయా గ్రామాలలోని పలు సమస్యలను సర్పంచులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు పాల్గోన్నారు.

## బుచ్చి వైస్ చైర్మన్ల ఎంపిక విషయంలో సమన్యాయం జరిగేనా !



**బుచ్చి జనవరి 28, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం వైస్ చైర్మన్ల ఎన్నిక ఫిబ్రవరి 3 వ తేది ఖరారు అయింది. ఈ సారి అయినా అధికార పార్టీలో వైస్ చైర్మన్ల ఎంపికలో సమన్యాయం జరిగేనా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా (బిసి), గతంలో వైస్ చైర్మన్లు కోటంరెడ్డి లలితారెడ్డి (ఒసి), షేక్ షాహుల్ మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి. కాని ఎస్‌సి సామాజిక వర్గానికి ఎక్కడ అవకాశం లేదు. ఈ సారి అయినా ఎస్‌సి సామాజికి వర్గానికి, ఓసి సామాజిక వర్గానికి చోటు లభిస్తుందా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు. చైర్‌పర్సన్ బిసి, వైస్ చైర్‌పర్సన్లు ఒకర్ని ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వారిని, మరోకర్ని ఒసి సామాజిక వర్గానికి చెందిన వారికి స్దానం కల్పిస్తే బాగుంటుందని అందరికి సమన్యాయం జరిగినట్లు ఉంటుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈవిషయంలో కోవూరు శాసనసభ్యురాలు ఆచి తూచి అడుగు వేయాలని పలువురు చెబుతున్నారు.

## పొలం పిలుస్తొంది కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన




**సీతారామపురం జనవరి 28 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని పబ్బులేటిపల్లి గ్రామ ంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్య క్రమాన్ని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతు సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి వరి పంట ప్రస్తుతం చిరు పొట్ట దశలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం నివార ణకు తగు సూచనలు చేశారు. అనంతరం యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా ఎకరానికి 5 వందల ఎంఎల్ వాడడం వల్ల పంట పెరుగుదలకు ఉపయోగపడి సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. కాండం కుళ్ళు తెగులు నివారణకు తగు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏఇం సాంబశివయ్య, విఏఏ కవిత, మరియు రైతులు పాల్గో న్నారు.

## ఉల్లాస్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం




**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి స్థానిక శ్రీ శక్తి భవనంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై ఉదయగిరి మండల వెలుగు సిబ్బందితో డీఆర్‌డీఏ పీడీ వి.నాగరాజు కుమారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ వయోజనులకు పుస్తకాలతో పాటు వీడియో రూపేనా విద్యను అందిం చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ జిల్లా సిబ్బంది, మండల సిబ్బంది, వెలుగు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మన్నేటి చొరువతో ప్రమాదాల మలుపుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం మాసాయిపేట వెళ్ళే మార్గంలోని మలుపు దగ్గర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి చొరువతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ మలుపులో పలు ప్రమాదాలు జరిగి కొంత మంది మృత్యువాత పడటం జరిగింది. ఇందులో భాగంగా ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని ఇటీవల టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పరిశీలించారు. రహదారి వెంబడి మలుపులు ఉండటం చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు వాహనదారులకు సరిగా కనిపించకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించిన ఆయన మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రమాదాలను నివారించేందుకు మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయించారు. వాహనదారులు మలుపుల దగ్గర తగు జాగ్రత్తలు పాటించాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలియజేశారు.

## ఉదయగిరిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పంచాయతీ కార్యాలయం ఆవరణంలో సీసీ రోడ్ల నిర్మాణం పనులను సర్పంచ్ పాములూరు సామ్రాజ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్తుజ హుస్సేన్, ఎంఎ రియాజ్, వార్డు సభ్యులు మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి హరిజబ్బర్, మా భాష రంగనాయకులు, నెంబర్ ఉప్పుటూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదం ముంచుకొస్తున్నా... పట్టించుకోరేం..!
## విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంపై విమర్శలు



**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** నిత్యం జనంరద్దీతో తలము నకలవు తున్న రోడ్డులో ప్రమాదం ముంచుకొస్తున్నా... విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోరేం. అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు. కావలి పట్టణం రైల్వే రోడ్డులో పోలీసు కమాండెంటెంట్ కంట్రోల్‌రూమ్ ముందు, మసీదు పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఒరిగింది. ఈ రోడ్డులో విద్యుత్‌శాఖ అధికా రులు, మున్సిపల్‌శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు నిత్యం పలుమార్లు రాకపోకలు సాగిస్తుంటారు. కావలి పట్టణ రైల్వేస్టేషన్‌కు పోయే ఈ రోడ్డు నిత్యం జనంరద్దీతో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పొరపాటునో, గ్రహపాటునో ఈ ట్రాన్స్‌ఫారం ఒరిగిపడిపోతే ఎలాంటి ప్రమాదం చవిచూడాల్సి వస్తుందో అన్నభయంతో జనం ఉన్నారు. ఇప్పటికైనా కావలి రైల్వేరోడ్డులోని ఒరిగిన ట్రాన్స్‌ఫారంను సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, కావలి పట్టణంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతినిఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న స్తంభాలు, ఒరిగిన ట్రాన్స్‌ఫారంలను సరిచేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ముదివర్తిలో రీ సర్వే గ్రామ సభ



**విడవలూరు, జనవరి 28, ప్రభాతవార్త :** మండలం ముదివర్తి గ్రామంలో కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ఆదేశాల మేరకు రీ సర్వే గ్రామ సభ కార్యక్రమం తహశీల్దార్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లా డుతూ రైతులు స్వచ్ఛందంగా భూ సమస్యలను తెలిపారు. తదుపరి శాశ్వత భూమి పరిష్కారం జరుగుతుందని తెలియజేశారు. అలాగే భూమి విస్తరణం తప్పిదాలు జరిగినట్లయితే వినతి పత్రం అందజేయాలన్నారు. కావలి తహశీల్దార్, స్థానిక ఎంపిటిసి కుడుముల మోహన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం, మండల సర్వేయర్ మస్తాన్ భాష, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, గౌతమి, గ్రామ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం:: గిరిజన సంక్షేమ శాఖ**
**ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (గురుకులం)**
Rc.No.APTWRE-1321/4/2023, **ప్రవేశ ప్రకటన** Dt: 10.01.2025
2025 - 26 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియం మరియు సి.బి.ఎస్.సి. సిలబస్‌తో నడుపబడుతున్న ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాలలో 6వ తరగతిలో అన్నీ 60 సీట్లను నింపడానికి అర్హులైన బాలబాలికల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుతున్నవి. దరఖాస్తులు గురుకులం వెబ్‌సైట్ https://twreiscet.dev.nidhi.apcfss.in/, https://aptwgurukulamap.gov.in/ ద్వారా సమర్పించవలెను. దరఖాస్తులు 22.01.2025 నుండి 19.02.2025 వరకు స్వీకరించబడును. వ్రాత పరీక్ష తేది: 25.02.2025 విద్యార్హతలు, విద్యాలయం వారి తరగతిలో గల ఖాళీలు, కొడవలూరు మండలం, ఇ.ఎం.ఆర్.ఎస్.చంద్రశేఖరపురం పరీక్షా కేంద్రం మొదలైన వివరములు అన్ని పైన పేర్కొన్న గురుకులం వెబ్‌సైట్ నందు గలవు. ఇతర వివరముల కొరకు ప్రిన్సిపల్, కొడవలూరు, ఫోన్ నెం: 9010175322 కు సంప్రదించగలరు.
సం/- పి.వి.కె.పరిమళ
జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

## సమావేశాలకు తల్లులు తప్పనిసరిగా హాజరు



కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త : పాఠశాలల్లో క్రమం తప్పకుండా నిర్వహించే పాఠశాల కమిటీ సమావేశాలకు సంబంధిత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని డీఆర్‌పీ వి.కృష్ణప్ప అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పాఠశాల విద్యా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సమావేశాలకు తల్లిదండ్రులు ఎవరో ఒకరు హాజరైతే వారి బిడ్డకు సంబంధించిన విద్యాబోధన ఎలా ఉంది. పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయి. ఉపాధ్యాయులు సక్రమంగా బోధిస్తున్నారా.. తమ బిడ్డలు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా అనే విషయాలను తెలుసుకోవచ్చున్నారు. ఇటువంటి సమావేశాలకు వారు హాజరు కాకపోతే బిడ్డల పట్ల వారి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సమావేశాలకు వారు హాజరై పాఠశాల అభివృద్ధి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా వచ్చిన తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన పథకం ఎలా ఉంది అనే విషయాలు కూడా పరిశీలించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ షాహిన , ,ఎస్ఎంసీ కమిటీ వైస్ ఛైర్మన్ దేవసేన, సభ్యులు శంకర్ ప్రసాద్, సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం



**కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త :** ఆడపిల్లకు పెళ్లి ఈడు వయస్సు వచ్చిన తర్వాతే వివాహం చేయాలని అట్లు కాకుండా బాల్య వివాహాలు చేయడం వలన చట్టపరంగా నేరమే కాకుండా బిడ్డల భవిష్యత్తు కూడా దెబ్బతినే అవకాశం ఉందని పీహెచ్ఎన్ కె. కృష్ణమ్మ అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళి నగర్ గిరిజన కాలనీలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లకు ఇటువంటి బాల్య వివాహాలు చేయడం వలన ఆరోగ్యపరంగా వారు భవిష్యత్తులో అనేక సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందన్నారు. ముఖ్యంగా ఈ బాల్య వివాహం మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలకు దారి తీస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహాలు చేయలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే ఇలియాజ్, ఏఎన్ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ విన్స నందిని, అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరమ్మ, సుందరమ్మ, గ్రామ పెద్దలు, సాయి, తదితరులు ఉన్నారు.

## మెగా జాబ్ మేళాలో 33 మంది ఉద్యోగాలకు ఎంపిక

**కందుకూరు, జనవరి 28, ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంలోని టీఆర్ఆర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాలో 61 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జాబ్ మేళాకు వచ్చిన నిరుద్యోగులను ఇంటర్వ్యూలు జరగగా 33 మందికి సెలెక్ట్ అయ్యారని, వారికి ఆఫర్ లెటర్స్‌ను కంపెనీ వారు విడుదల చేయడం జరిగిందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ జాబ్ మేళా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి నిరుద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళాకు వచ్చిన నిరుద్యోగులకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. నిరుద్యోగులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి వారు ధన్యవాదాలు తెలియజేశారు.



## రసాయనిక మందులు అధిక మోతాదులో వాడరాదు

**కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త :** కోవూరు మండలం చెర్లోపాలెం, లేగుంటపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో వరి పైర్లు ఎక్కువ భాగం చిరుపుట దశలో ఉన్నా యన్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడా కూడా అగ్గితెగులు కనబడడం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు అగ్గితెగులుకు సంబంధించిన మందులు వాడనవసరం లేదన్నారు. వరిదుగ్గలను నీటి మట్టం దగ్గర పరిశీలిస్తే సన్న పిల్ల దోమలు ఉన్నట్లయితే బుప్రోజిన్ 1.6 మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఒకవేళ పెద్ద దోమలు ఉన్నట్లయితే ఇతోఫెన్‌ప్రాక్స్ 2.50 మి.లీ.. లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. క్లోరిపైరిపాస్, ప్రొఫెనోపాస్, సింతటిక్ వాడితే దోమల ఉధృతి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా పైరు పూత దశలో ఉన్నప్పుడు అసిఫేట్ వాడరాదని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయకులు నారాయణ, వంశీ, చైతన్య, రైతులు ఉన్నారు.



## ఎంపిడిఓను సన్మానించిన ఉప ఎంపిపి



**విడవలూరు, జనవరి 28, ప్రభాతవార్త :** స్థానిక ఎంపిడివో నగేష్ కుమారికి రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు పొందడం జరిగింది. మండల ఉప ఎంపిపి ఆవుల శ్రీనివాసులు, అలాగాని పాడు ఎంపిటిసి జగన్మోహన్ ఎంపిడివోను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి సన్మానం చేసి అభినందించారు. ఇంకా మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షిస్తూ కొనియాడారు.

## ఎలుకల నివారణ పై అవగాహన




విడవలూరు, జనవరి 28, ప్రభాతవార్త : మండల ంలోని విడవలూరు ఆర్ఎస్‌కె నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి. సుజాత ఆధ్వర్య ంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె రైతు లతో మాట్లాడుతూ బ్రోమో డయా లిన్ మందు ను నాలుగు కేజీల నూకలు, 100 గ్రాముల నూనె కలిపి ఎలుకల బోన్ల వద్ద ఉంచినట్లయతే ఎలుకలను నివారించవచ్చని తెలియజేశారు. అలాగే వరి వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. వెంకట కృష్ణయ్య, విఏఏలు టి. అరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గండవరంలో పొలం పిలుస్తుంది



**కొడవలూరు (విడవలూరు), జనవరి 28, ప్రభాతవార్త :** మండలంలోని నాయుడుపాలెం, గండవరం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సామూహిక ఎలుకల నివారణ కార్య క్రమం కింద డెమో ఏర్పాటు చేసి బ్రోమో డలిన్ ఎలుకల మందును ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది. వరి పొలాలను పరిశీలించి వరిలో పాము పొడ తెగులు ఆశించి ఉందని నివారణకు హెక్సా కొనజోల్ రెండు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులందరూ కూడా తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏఓ సిహెచ్, ఎస్ లక్ష్మి, విఏఏలు కె.శ్రావ్య, టి. కవిత, స్థానిక నాయకులు మాగంట సతీష్ కుమార్ రెడిడ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సున్నంవారిచింతల్లో పశు ఆరోగ్య వైద్య శిబిరం

**ఉదయగిరి, జనవరి 28, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని సున్నవారిచింతల గ్రామంలో మంగళవారం జల్సా యాదవ్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య వైద్య శిబిరం జరిగింది. ఈశిబిరంలో పాడి పశువులకు గొర్రెలు, మేకలకు పరీక్షలు నిర్వహించి నట్టల నివారణకు ఉచితంగా మందులు అందజేశారు. పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి పోషకాలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కే.కొండయ్య, వెంకటరావు, సిబ్బంది ఖాదర్ భాషా, ఖాజా మొహిద్దీన్, వెంకటేశ్వరరావు, వీరాంజనేయులు, నాసిర్, మహేశ్వరి పాల్గొన్నారు.

## వేడుకగా మరియాల స్వామికి ,పోలేరమ్మ తల్లికి పూజలు




**బుచ్చి జనవరి 29 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌లోని రజకులు మంగళవారం వైభవంగా పోలేరమ్మతల్లికి, మరియాల స్వామికి పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించారు. జెండాదిబ్బ వద్ద ఉన్న పోలేరమ్మ తల్లికి, మరియాల స్వామికి తాత,ముత్తాతల నుండి ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రజకులందరు సంక్రాంతి వెళ్ళిన సుమారు 25 రోజులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ,ఈ సంవత్సరం కూడా మండపాన్ని సుగంద పరిమళ పుష్పాలతో అలంకరించి స్వామి,అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రజకుల కుటుంబాలు పెద్దఎత్తున పాల్గోన్నారు.

## కావలి డీఎస్పీకి అభినందనలు తెలిపిన ఏరియావైద్యశాల వైద్యులు



**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** కావలి డీఎస్పీ పి.శ్రీధర్‌కు కావలి ఏరియావైద్యశాల వైద్యులు మంగళవారం అభినందనలు తెలిపారు. కావలి డీఎస్పీ కార్యాలయానికి ఏరియావైద్యశాల సూపరిం డెంట్ డాక్టర్ పద్మావతి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రమీల, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ విజయవాణి, డాక్టర్ ప్రణీత్‌లు వెళ్లారు. డీఎస్పీకి ప్రశంశాపత్రంతోపాటు మొక్కను అందచేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ విజయ వాణి మాట్లాడారు. కావలి ఏరియావైద్యశాలలో రక్తనిల్వలు తక్కువగా ఉన్నందున పోలీసుల అమరవీరుల దినోత్సవంనాడు డీఎస్పీ శ్రీధర్, బ్లడ్‌వారియర్స్‌టీమ్ సహకారంతో ఈ కార్యాలయంలో 75యూనిట్ల రక్తాన్ని వైద్యశాలకు అందచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు సహకారాన్ని అందించినందుకు డీఎస్పీకి గణతంత్ర దినోత్సవంలో ప్రశంశాపత్రాన్ని అందచేయాల్సి ఉండగా ఈ రోజు ఆయనకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ మాట్లాడారు. ప్రజలకు పోలీసులు అంకితభావంతో పనిచేస్తారన్నారు. అందులోభాగంగా ప్రతిఏటా పోలీసుల అమరవీరుల దినోత్సవంనాడు రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి అవసరమైనవారికి రక్తం అందచేసి ప్రాణాలు కాపాడతామన్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌లోకూడా బ్లడ్‌బ్యాంక్ ఉన్నదని తెలిసి 75యూనిట్ల రక్తాన్ని అందచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లడ్‌వారియర్స్‌టీమ్ నిర్వాహకులు వినయ్‌కుమార్, మహ్మద్ అబ్దుల్‌అలీంలు పాల్గొన్నారు.

## పోటీపరీక్షల్లో నలంద ఒలంపియాడ్ విద్యార్థుల ప్రతిభ



**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** భారత సంస్కృతి ప్రతిష్ఠాన్‌వారు నిర్వహించిన పోటీప రీక్షల్లో కావలి పట్టణం గొల్లమూడి వారివీధిలోని నలంద ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటిచెప్పారు. ప్రతిభను చాటిచెప్పిన విద్యార్థులను మంగళవారం పాఠశాల డైరక్టర్ ఎండి వశీం అభినందించి మాట్లాడారు. "రామా యణం" అంశంపై జరిగిన పోటీపరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనపర్చారన్నారు. కావలిటౌన్‌కు సంబంధించి మొదటి బహుమతి పివి. రాఘవి, రెండవ బహుమతి పి.యశ్విని, మూడవ బహుమతి ఆర్.హేమసృజన్ సాధించారన్నారు. ఎంఈఓ గోవిందయ్య చేతులమీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. నలంద ఒలంపియాడ్ పాఠశాలలో విద్యతోపాటు భారత సనాతన ధర్మాలైన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను, భగవద్గీత శ్లోకాలను, రామాయణం, మహాభారత కథలను భోదించడం జరుగుతుందన్నారు. తమ పాఠశాల విద్యార్థులను మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రముఖ రైస్‌వ్యాపారి దుగ్గిశెట్టి సుబ్బయ్య నేత్రదానం



**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** కావలి పట్టణం కొత్తబజారులో నివసిస్తున్న ప్రముఖ రైస్‌వ్యాపారి దుగ్గిశెట్టి సుబ్బయ్య నేత్రదానం చేశారు. వాసవి వనితాక్లబ్ సభ్యురాలు దుగ్గిశెట్టి అనసూయమ్మ తన భర్త సుబ్బయ్య నేత్రాలను దానం చేశారు. వాసవి వనితాక్లబ్ అద్యక్షురాలు దుగ్గిశెట్టి హేమలత వారి బావ దుగ్గిశెట్టి సుబ్బయ్య నేత్రదానం చేయమని కుటుంబసభ్యులను కోరారు. దీంతో సుబ్బయ్య భార్య అనసూయమ్మ, కుమారులు రాము, లక్ష్మణ్, కుమార్తె భాగ్యలక్ష్మిలు నేత్రదానాలకు అంగీకరించారు. దీంతో నెల్లూరు మోడ్రన్ ఐ హాస్పిటల్ సిబ్బంది సుబ్బయ్య కార్నియాలను సేకరించారు. కావలి వాసవి వనితాలెజెండ్స్ సేవలను వారు కొనియాడారు.

## పోలినాయుడు చెరువులో ఉద్రిక్తత పోలీసుల పహారా



**బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఇస్కపాళెం పంచాయితీలోని పోలినాయుడు చెరువు గ్రామంలో గత శనివా రం,సోమవారం ఫ్లెక్సిల విషయంలో ఘర్షణ చోటు చేసుంది.ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకోగ ముందు జాగ్రత్తగా సిఐ శ్రీనివాసులురెడ్డి,ఎస్ఐ సంతో ష్‌రెడ్డి గ్రామంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ప్రతి ఒక్కరూ బైక్‌పై హెల్మెట్.. కారులో సీట్‌బెల్ట్ తప్పనిసరి..!




**కావలి, జనవరి28 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలని, కారునడిపేవారు విధిగా సీటుబెల్ట్ వేసుకోవాలని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ పిలుపునిచ్చారు. కావలి టూటౌన్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు ఆధ్వర్యంలో మహిళాకానిస్టేబుళ్ల చేపట్టిన హెల్మెట్‌పై అవగాహన ర్యాలీని మంగళవారం డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు యాక్సిడెంట్స్‌ను నివారించేందుకు ఈ నెల 16వ తేదీనుంచి ఫిబ్రవరి 15వ తేదీవరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ రోజు టూటౌన్ మహిళా కానిస్టేబుళ్లు హెల్మెట్‌పై అవగాహన కల్పించారన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. రోడ్డుప్రమాదాలను నివారించేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. మహిళా కానిస్టేబుళ్లతోపాటు డిఎస్పీ పి.శ్రీధర్, టూటౌన్ సిఐ గిరిబాబు, ఎస్ఐలు హెల్మెట్లు ధరించి టూటౌన్ పోలీసుస్టేషన్‌నుంచి ట్రంకురోడ్డులో హెల్మెట్ అవగాహనర్యాలీని నిర్వహించారు.


## 1న అష్టబంధన మహాకుంబాభిషేక మహోత్సవం



**వింజమూరు, జనవరి 28 ,ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో వెలసియున్న శ్రీగృహమల్లీశ్వర లక్ష్మీనర్శిం హస్వామి ఆలయంలో అష్టబంధన మహాకుంబాభిషేకం మహోత్సవం ఫిబ్రవరి 1 శనివారం 3వ తేదీ వరకు జరుగుతుందని ఆలయ చైర్మెన్ అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఫిబ్రవరి1న భగవత్ ఆరాధన, విశ్వక్సేన ఆరాధనం, పుణ్యాహవచనం, గోపూజ, అజస్రాదీపారాధనం, యాగశాల, ఆలయ వాస్తు పర్యాగ్నికరణం, పంచగవారాధనం తదితర పూజలు నిర్వ హిస్తారన్నారు. 2న విశ్వక్సేనారాధనం, పుణ్యాహ వచ నం, శ్రీలక్ష్మీ నర్శింహస్వామి, వేణుగోపాల స్వామి, రంగనాథస్వామి యం త్రస్థాపనం, విగ్రహస్థాపనం , గృహమల్లీశ్వరస్వామి బానవట్ట సమర్పణం, మంగళహారతి, 3న విశ్వక్సేన ఆరాధనం, పుణ్యాహవచనం, అగ్నిపనయనం, కుంభారాధనం, అష్టబంధనం, మహాపూర్ణాహుతి, కుంభబింబాల ఆలయ ప్రవేశం, కళావాహనం , కుంబాభిషేకం, అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనర్శింహస్వామి కళ్యాణోత్సవం, మంగళహారతి, శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించబడుతుందన్నారు. కావున భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు అన్న పురెడ్డి శ్రీనివాసులురెడ్డి, భోగిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రూపినేని వెంకటరత్నం నాయుడు, గొల్లపల్లి పెంచ˘లమ్మ, గొల్లప్రోలు రాములమ్మ ,ఇండ్ల శ్రావణి తదితరులు పాల్గొన్నారు.




## జొన్నవాడ ఆలయ ఇఒ వివాదం లోకాయుక్తలో విచారణ




**బుచ్చి జనవరి 28 ప్రభాతవార్త :** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి సన్నిధిలో బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన రాజా అనే భక్తుడు తనకు జరిగిన అన్యాయం పట్ల ఆలయ ఇఒ శ్రీనివాసులురెడ్డి పైన లోకాయుక్తగా ఫిర్యాదు చేయగా కర్నూలు లోకాయుక్త కోర్టులో విచారణ నిర్వహించారు. బహుశ ఇటువంటి సంఘటన జొన్నవాడ చరిత్రలో ఎప్పుడు జరగలేదని చెప్పవచ్చు. ఒక భక్తుడు తనకు అన్యాయం జరిగిందంటు కోర్టు వరకు పోవడం ఇదే ప్రధమం అని చెప్పవచ్చు.రాజా అనే భక్తుడు తనకు ఇఒ పైన ముఖ్యమంత్రికి,దేవాదాయశాఖ మంత్రికి, దేవాదాయ కమీషనర్‌కి, అసిస్టెంట్ కమీషనర్‌కి, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయడం ఇదే మొదట అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆలయ ఇఒ శ్రీనివాసులురెడ్డి భక్తులకు సౌకర్యాలు కలిగించడంలో విఫలమైయ్యారని,భక్తుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని రాజాస్వామి పేర్కున్నారు. భక్తులు ఎంతో భక్తితో దేవస్ధానానికి వెళితే జొన్నవాడ ఆలయంలో ఎటువంటి సౌకర్యాలు కలగడం లేదని రాజాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఎంతో వేడుకగా జరిగే కార్తీకమాసం పూజలు, ఇఒ నామమాత్రంగా చేసి వదిలివేశారని ఇది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఇఒ కి రాజకీనాయకులు అండగా నిలడం చాలా బాధకరమని అన్నారు. ఇఒ శ్రీనివాసులురెడ్డిపై చర్య తీసుకునే వరకు తన పోరాటం ఆగదని త్వరలో జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయి ఆలయం వద్ద ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటానని,అన్ని ధార్మిక సంఘాల దృష్టికి తీసుకొని వెళతానని రాజాస్వామి తెలిపారు. ఇఒ శ్రీనివాసులురెడ్డి వచ్చినప్పటి నుండి ఆలయానికి భక్తులు రావడం కూడా తగ్గిపోయిందని రాజాస్వామి స్పష్టం చేశారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జనవరి 28, ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పుష్యమాస మంగళవారం పర్వదినం సందర్భంగా ప్రాత: కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జనార్ధనం నాగరాజాచార్యులు అభిషేక పూజలు సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పల్లకి సేవ కార్యక్రమాలను



కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా జనార్ధనం నాగరాజాచార్యుల కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్ర స్వామి, తదితరులు ఉన్నారు.





## చల్లని వాతవరణం.. కనుచూపుమేర పరుచుకున్న పచ్చదనం..

రంగురంగుల పక్షుల కిలకిలరావాల నడుమ పోలేరమ్మ తల్లి ఆలయం. ఈ అపురూప దృశ్యం.. ముత్తుకూరు మండలం మునునూరువారి పాలెం కొత్తపాలెం గ్రామం.











ఫోటోలు : నంద మాల్యాద్రి